క్లుప్తంగా

రేపు మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

గట్టు: మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చెన్నయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు పత్రాలతో పాటు ఆధార్, బ్యాంకు పాస్‌బుక్ తీసుకురావాలని కోరారు. గట్టు ఎస్‌బీఐ, మాచర్ల బ్యాంకు పరిధిలోని అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని పేర్కొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



మల్దకల్: చదువుతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ శేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని చర్లగార్లపాడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను ఆయన అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జయరాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ పంచాయతీ డే

ధరూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జబ్బార్ ఆధ్వర్యంలో సోమవారం నేషనల్ పంచాయతీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు



మల్దకల్: పంచాయతీ పనులకు వినియోగించే ట్రాక్టర్‌ను సర్పంచ్ సొంత పనులకు వాడుకుంటున్నాడని ఎంపీడీఓ కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిలకు నేతువానిపల్లి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సోమవారం వ్యవసాయ పనులకు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా పనులు చేస్తున్నాడని వివరించారు. సర్పంచ్ వీరేష్‌పై చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు తిమ్మప్ప, వీరన్న, సత్యన్న, విష్ణులు కోరారు.

జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు



ఉండవెల్లి: ప్రమాదాల నిరవారణకోసం మండల పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మండలంలోని జాతీయ రహదారిపై పోలీస్ సిబ్బంది, నేషనల్ హైవే సిబ్బంది బారీకేడ్లను ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్ఐ బాల్‌రాజు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని కోరారు. మద్య తాగి వాహనాలను నడుపొద్దన్నారు. కార్యక్రమంలో పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

రాజోళి: అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కేవీపీఎస్ నాయకులు విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. నిల్వ చేసిన ధాన్యం వర్షానికి తడిసిందని వాపోయారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

అప్రమత్తత అవసరం

రాజోళి: వేసవికాలంలో పిల్లలపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మరియమ్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెద్దల సమక్షంలో పిల్లలకు ఈత నేర్పించాలని స్నేహితులతో పంపించొద్దని పేర్కొన్నారు. ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నతానియేల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈటలపై ఫిర్యాదు

పెబ్బేరు రూరల్: బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకులు సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేయడమే బీజేపీ నాయకుల పని అని మండిపడ్డారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. ఆశన్న, గోవిందు, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

హద్దులు చూపరా?



లబ్ధిదారులకు కేటాయించిన స్థలంలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

- 22 ఏళ్ల కిందట పట్టాల పంపిణీ
- లబ్ధిదారులకు తప్పని తిప్పలు

అయిజ: పట్టణంలో ఎక్లాస్‌పురం రోడ్డు పక్కన గత ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలకు సంబంధించిన పట్టాలు పంపిణీ చేసింది. 22 ఏళ్లు గడిచినా ఇంతవరకు లబ్ధిదారులకు ప్లాటు స్థలం చూపించలేదు. అధికారులతో సర్వే నిర్వహించి ఎవరి ప్లాటు ఎక్కడుందో సరిహద్దులు ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు 20 సంవత్సరాల నుంచి కోరుతున్నా ఇప్పటి వరకు ఫలితం దక్కలేదు.

450 పట్టాలు అందజేత

అయిజ పట్టణంలోని ఎక్లాస్‌పురం రోడ్డు పక్కన 2001 జనవరి 26న సర్వేనంబర్ 9-15లో 450 మందికి ప్లాట్లకు సంబంధించిన ఇంటి పట్టాలు అందజేశారు. ఇంతవరకు సరిహద్దులు చూపపపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కనీసం కొలతలు కూడా సూచించలేదని లబ్ధిదారులు వాపోయారు. ఇళ్ల నిర్మించుకుందామనుకున్నా ఎవరి స్థలం ఎక్కడుందో తెలియని అయోమయం పరిస్థితి నెలకొంది.

ప్లాట్ల స్థలంలో పెరిగిన ముళ్ల పొదలు

పట్టణంలోని నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించకపోవడంతో ఆప్రదేశంలో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. ముళ్ల పొదలు తొలగించి, లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లకు సరిహద్దులు చూయించి హద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే సమస్య ఉత్పన్నం అవుతుందని పలువురు ఆరోపించారు.

సరిహద్దులు ఏర్పాటు చేయాలి



22 సంవత్సరాల కిందట అప్పటి ప్రభుత్వం పట్టాలిచ్చింది. ఇప్పటివరకు ప్లాట్లకు పట్టా నంబర్లు ఇవ్వలేదు. కనీసం ప్రభుత్వ స్థలంలో సరిహద్దులు సూచించే హద్దు రాళ్ల పాతలేదు. ప్లాట్లలో ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. వాటిని తొలగించి, సర్వేచేసి, లేఅవుట్ ఇవ్వాలి. అధికారులు స్పందించి ప్లాట్ల సరిహద్దులు చూయిస్తే ఇంటి నిర్మాణం చేపడుతాం.

\- తిరుమలరెడ్డి, అయిజ

ప్లాట్లు ఎక్కడున్నాయో తెలువదు



ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది కాని ప్లాట్ల స్థలం చూపించలేదు. 22 ఏళ్లుగా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నా పట్టించుకోవడం లేదు. కొంతమంది లబ్ధిదారులు మృతి చెందారు. వారికి కేటాయించిన పట్టాలను రద్దుచేసి లబ్ధిదారుల వారసుల పేరుపై తిరిగి ఇవ్వాలి. లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

\- నరసింహులు, అయిజ

సర్వే చేయిస్తాం



ప్రభుత్వం నిరుపేదలకు పట్టాలు ఇచ్చిన స్థలంలో ముళ్ల పొదలు తొలగించినా తిరిగి దట్టంగా పెరిగాయి. ఇండ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న లబ్ధిదారులు పట్టాల ధ్రువపత్రాలు చూపించాలి. సర్వేయర్‌తో భూమిని సర్వే చేయిస్తాం. నివాసస్థలాలకు సంబంధించిన పట్టాలను అధికారులకు అందజేయాలి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

\- లక్ష్మి, తహసీల్దార్

వీఓఏల వినూత్న నిరసన



గద్వాలలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న వీఓఏలు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని మెస్మా కార్యాలయం ఆవరణంలో వీఓఏలు చేపడుతున్న సమ్మె ఎనిమిదో రోజు సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా వీఓఏలు ఒంటికాలుపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడు తిమ్మప్ప మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అర్హులైన వీఓఏలకు పదోన్నతులు, ఉద్యోగ భద్రత, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో వీఓఏలు వెంకటరామయ్య, వెంకటేష్, కృష్ణవేణి, సౌమ్య, వరలక్ష్మీ, షబాన, భీసమ్మ తదితరులు ఉన్నారు.



గట్టులో ఆందోళన చేస్తున్న వీఓఏలు



మల్దకల్‌లో..

గట్టు: వీఓఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వీఓఏలు డిమాండ్ చేశారు. సోమవారం మహిళా సమాఖ్య ఎదుట వీఓఏలు ఒంటి కాలుపై నిల్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించకుంటే ఆందోళనల ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

మల్దకల్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాడుతామని వీఓఏ సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. వారికి బీఎస్పీ నాయకులు రాజు, ముని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అపర్ణ, మహేందర్, హనుమంతు, వెంకట్రాములు, మునిస్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను అభివృద్ధి చేస్తాం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: పట్టణాల మాదిరి పల్లెలను అభివృద్ధి చేస్తామని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. సోమవారం మండలంలోని చిన్న ధన్వాడలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల రూపురేఖలు మారాయని, డ్రైయినేజీలు, సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు ప్రత్యేక నిధులతో నిర్మించామన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

ఉండవెల్లి: కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. సోమవారం మండలంలోని అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా శంకరాచార్య జయంతి



గద్వాలలో పూజలు చేస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు



గట్టులో ఆదిశంకరాచార్య జయంతిలో విశ్వబ్రాహ్మణులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం శంకరచార్య చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మికమార్గంలోకి రావాలన్నారు. పాశ్చత్య సంస్కృతిని వీడాలన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ వీరస్వామి, జిల్లా అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా చారి, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శంకరయ్య చారి తదితరులు ఉన్నారు.

గట్టు: మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉరుకుందాచారి, మండల అధ్యక్షుడు రాఘవేంద్రచారి, ఉపాధ్యక్షుడు తిమ్మప్పాచారి, ప్రధాన కార్యదర్శి ఫొటో వెంకటేష్, సభ్యులు నారాయణ, మోనేష్, నవీన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు



మంత్రిని సన్మానిస్తున్న సాధన సమితి నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: పరిపాలన సౌలభ్యం కోసం ప్రజల ఆకాంక్ష మేరకు ఎర్రవల్లిని నూతన మండల ఏర్పాటుకు కృషి చేసిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మండల సాధన సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం వనపర్తిలోని మంత్రి కార్యాలయంలో వారు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం మండల ఏర్పాటులో సహకరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రంగారెడ్డి, నాయకులు రాఘన్న, ఆంజనేయులు, కృష్ణ, లక్ష్మన్న, రవీందర్‌రెడ్డి, లోకారెడ్డి, నర్సింహారెడ్డి, ఈదన్న, రాముడు, సుధాకర్‌రెడ్డి, జమ్మన్న, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం

గద్వాల: పోటీ ప్రపంచంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే మరింత ముందుకు వెళ్తారని మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కాకతీయ టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతోనే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీకాంత్‌జోషి, రాము తదితరులు పాల్గొన్నారు.

వల్లూరును ఎర్రవల్లిలో చేర్చాలి



ఎమ్మెల్సీ చల్లాకు వినతిపత్రం అందిస్తున్న వల్లూరు గ్రామస్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని వల్లూరును నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎర్రవల్లి మండలంలో చేర్చాలని గ్రామస్తులు సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ చల్లా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చల్లా సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అదేవిధంగా తహసీల్దార్ సుబ్రమణ్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు రామిరెడ్డి, మల్లారెడ్డి, కృష్ణ, కాంతారెడ్డి, రవిప్రకాష్, బీసన్న, సులేమాన్, చిట్టెన్న, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర రక్త గాయలైన సంఘటన సోమవారం గద్వాల మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఇటిక్యాల మండలం కోడేరు గ్రామానికి చెందిన తెలుగు రమేష్ వివిధ పనుల నిమిత్తం బైక్‌పై గద్వాలకు బయలుదేరాడు. అనంతపురం దయ్యాలవాగు సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు తుపాన్ వాహనం బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

ఘనంగా అంగన్‌వాడీ కేంద్రం వార్షికోత్సవం



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల, మానవపాడు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవం నిర్వహించారు. సోమవారం అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, ఆదిలక్ష్మిల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా చిన్నారుల చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఆత్మలింగారెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

శాంతినగర్: ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను అలంపూర్ ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు కలీముల్లా సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. చేవెళ్లలో నిర్వహించిన సభలో కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు.

ఏసు ప్రభువు బోధనలు అనుసరణీయం



మానవపాడు: ఏసు ప్రభువు బోధనలు అనుసరణీయమని అంతర్జాతీయ ప్రసంగీకులు క్రైస్టవర్షిప్ సెంటర్ డా. జాన్‌వెస్లీ అన్నారు. మండలంలోని చెన్నిపాడులో ఎంబీ బేతేలు చర్చి మూడో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రెండో రోజు సువార్త మహాసభలకు ఆయన హాజరై మాట్లాడారు. వివిధ గ్రామస్తుల నుంచి క్రైస్తవులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గిడ్డంగుల రాష్ట్ర చైర్మన్ సాయిచంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

అయిజ: పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రెడ్డి కమ్యూనిటీ హాల్ వరకు చేపట్టనున్న డ్రైయినేజీ నిర్మాణ పనులకు వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో అన్ని వార్డుల్లో డ్రైయినేజీలు, సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణాల ప్రగతికి పాటుపడుతుందన్నారు. రోడ్లపై చెత్తచెదారం ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభివృద్ధి పనులు చేసేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషిచేయాలని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

వైఎస్ షర్మిల అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న అతిఖుర్ రహ్మాన్

గద్వాల అర్బన్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అరెస్ట్ అప్రజాస్వామికమని ఆ పార్టీ నియోకవర్గ కో-ఆర్డినేటర్ అతిఖుర్ రహ్మాన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో లోటస్‌పాండ్‌లో వైఎస్ షర్మిలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఈ నెల 26న ఇందిరా పార్క్ వద్ద టీ-సేవ్ ద్వారా నిరుద్యోగ దీక్ష చేపడతునట్లు నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. షర్మిలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున్న ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు యూనుస్, ప్రకాష్, అంజి, శాస్త్రీ తదితరులు ఉన్నారు.

వైకుంఠధామానికి స్థలం చూపించాలి

గట్టు: వైకుంఠధామానికి మరోచోట స్థలం కేటాయించాలని మండలంలోని గంగిమాన్‌దొడ్డి సర్పంచు నర్సమ్మ, ఉపసర్పంచు ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ జుబేర్ అహ్మద్ కలిశారు.

ఈ సందర్భంగా గ్రామ శివారులోని సర్వే నంబర్ 37లో వైకుంఠధామానికి కేటాయించిన 1.07 ఎకరాల స్థలం భారత్‌మాల రోడ్డు పరిధిలోకి వెళ్తుందని పేర్కొన్నారు. గ్రామంలోని మరోచోట వైకుంఠధామ నిర్మాణానికి స్థలాన్ని చూపించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



గద్వాలలో మల్దకంటికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని గంజిపేటకు చెందిన మల్దకంటి రెండు వారాల కిందట నీటిని వేడి చేస్తుండగా ప్రమాదవశాత్తు వేడి నీళ్లు కాళ్లపై పడి చర్మం కమిలిపోయింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2000-2001 పదో తరగతి బ్యాచ్ తోటి స్నేహితులు సోమవారం మల్దకంటికి ఆయన నివాసంలో రూ. 10వేల ఆర్థికసాయంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వడ్డే నాగరాజు, రఘు, చిన్న పాండు, నాగరాజు, సిరిగిరి కృష్ణ, శ్రీహరి, రామకృష్ణ, నాగరాజు తదితరులు ఉన్నారు.



తిమ్మాపురంలో ..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన కర్రె బీసన్న అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు నారాయణ నాయుడు, పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు మృతుడి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం మృతుని కుటుంబ సభ్యులకు ఇరువురు రూ. 5000 చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



అయిజలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆరగిద్దలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అయిజ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కోరారు. సోమవారం 16వ వార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీలోని ఒక్కొక్క వార్డులో 5 రోజుల చొప్పున మొత్తం 20 వార్డుల్లో 100 రోజులపాటు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ సుధారాణి, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వులో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచ్ జయమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, వెంకటన్న, పటేల్ జనార్దన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నరేందర్, అజయ్, మధు, హైదర్‌సాబ్, ఆంజనేయులు, డాక్టర్ నవీన్‌కుమార్, స్వరూపరాణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని ఆరగిద్ద, తారాపురం, ఇందువాసి గ్రామాల్లో కంటి వెలుగు శిబిరం కొనసాగుతోంది. సోమవారం మూడు గ్రామాల్లో మొత్తం 448 మందికి కంటి పరీక్షలు చేయించుకున్నారు. 29 మందికి అద్దాలను పంపిణీ, 26 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సౌజన్య, సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎంలు రేష్మ, ఈశ్వరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.